ప్రేమకోరేది త్యాగమా?

అది సాయంకాలం ఆరు గంటల సమయం. ఆఫీసర్స్ క్లబ్బు సందడిగా ఉంది. కొందరు చదరంగం ఆడుతున్నారు. మరికొందరు ప్లేయింగ్ కార్డ్సు వేస్తున్నారు. ఇంకొందరు కోర్టులో టెన్నిస్ ఆడుతున్నారు.

హాల్లో కుడివైపు మూలనున్న టేబులు దగ్గర నలుగురు కూర్చుని ఉన్నారు. పేకలు కలుపుతున్న వ్యక్తి డాక్టర్ విజయమోహన్. పేకలు పేర్చుకుంటున్నవాడు డాక్టర్ ఆనంద్. మిగతా ఇద్దరు రామకృష్ణ, కాంతారావు. స్టేట్ గవర్నమెంటులో గెజెటెడ్ ఆఫీసర్లు. వీళ్ళు నలుగురూ గత అయిదేళ్ళుగా ఆ క్లబ్బు మెంబర్లు. మంచి స్నేహితులు. నలుగురికీ పేకాట పిచ్చి.

కాలం గడచిపోతూ ఉంది. అందరూ పిచ్చాపాటీ మాట్లాడుకొంటూ ఆడుతున్నారు. ఏవేవో విషయాలమీద సంభాషణ జరుగుతూ ఉంది.

"ఒరేయ్ కాంతారావ్, లవ్ మేరేజెస్ మేలంటావా, అరేంజ్డు మేరేజెస్ మేలంటావా?" అడిగాడు రామకృష్ణ ఉన్నట్లుండి.

"భలే.... ఎలాంటి టాపిక్ ఎత్తావు గురూ!"

"స్వీట్ డ్రీమ్స్!" భుజాలెగురవేశాడు కాంతారావు.

"ఛ....ఛ....మీకు పెళ్ళిళ్ళయి ఒక్కొక్కరికి మీ అంత పిల్లలున్నా, మీ బుద్ధులు మాత్రం మారలేదు."

"బుద్ధులు ఎందుకు మారాలోయ్? మనిషికి వయస నేదొకటి ఏడ్చింది కాబట్టి, అది మనిషి శరీరంలో మార్పుల్ని తెస్తుంది, మనసుకు ఒక షేపంటూ లేదుకదా. అందుకే అది మారదు కొంతమంది విషయంలో." డాక్టర్ ఆనంద్ మాటలకు జవాబిచ్చాడు డాక్టర్ విజయమోహన్.

"సరే పోనీ, పదిమంది ముందు పెళ్ళి చేసుకొన్న అమ్మాయికంటే లేపుకొచ్చిన అమ్మాయంటే మగవాడు పడి చస్తాడట. దీనికేమంటారు?" అడిగాడు రామకృష్ణ.

"దీనికి జవాబు నీకు డాక్టర్ విజయమోహన్ దగ్గర దొరుకుతుంది." జవాబిచ్చాడు డాక్టర్ ఆనంద్.

"అంటే, వీడికి భార్యగాక లేపుకొచ్చినది ఇంకొటుందంటావా ? అరె ! ఈ విషయం మా కెవరికీ తెలియదే" అన్నాడు కాంతారావు ఆశ్చర్యం కనబరుస్తూ.

"కంగ్రాచ్యులేషన్స్!" అందరూ విజయమోహన్ని అభినందించారు.

"ఒరే పిచ్చి నాన్నలూ, వాడికి ఇంతమంది లేరు. ఉండేది ఒకే ఒక తాళికట్టిని భార్య "

"అయితే, ఆమె లేపుకొచ్చిన బాపతా ? వండర్" అన్నాడు రామకృష్ణ. అందరూ నవ్వారు.

"అన్నయ్యా" అంటూ ఆదరంగా ఆహ్వానించే సుమలత ముఖం అందరి కళ్ళ ముందూ మెదిలింది.

విజయమోహన్ సీరియస్గా ఆలోచిస్తున్నాడు. ఎవరేమంటున్నా మౌనంగా వింటున్నాడు తప్ప మాట్లాడడం లేదు. అతని గుండెలో దుఃఖతరంగాలు ఎగసెగసి పడుతున్నాయి.

"సారీ, విజయమోహన్. అయితే అంతా వదంతన్నమాట."

"ఏదో స్నేహితుడవని చొరవ తీసుకొన్నాం మమ్మల్ని క్షమించు." తలా ఒక మాటన్నారు.

విజయమోహన్ ఇక ఆడలేనన్నట్లు ముక్కల్ని టేబులుమీద పడేశాడు. కణతలు రుద్దుకొన్నాడు. కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"అఫెండ్ కావద్దు విజయ్. ఏదో తొందరపడి హాస్యానికి అన్నాను. అంతా మరచిపో" అన్నాడు రామకృష్ణ బాధపడుతూ.

"నో. ఇది హాస్యం కాదు. యదార్థం" సిగరెట్ పొగ పైకి ఊదుతూ సీరియస్గా జవాబిచ్చాడు విజయమోహన్.

"ఆః!" అన్నారంతా.

"అవును నా భార్యకూ, నాకూ శాస్త్రోక్తంగా వివాహం జరగలేదు నేను ఆమె మెడలో తాళి కట్టలేదు. అలా ఎందుకు చేయాల్సివచ్చిందో చెప్తాను గార్డెన్లోకి వెళ్దాం. రండి."

గార్డెన్‌లో ఒక సిమెంటు బెంచీమీద ముగ్గురు వ్యక్తులు కూర్చుంటే, విజయ మోహన్ దాని కెదురుగా ఉన్న బెంచిమీద రిలాక్సింగ్‌గా కూర్చున్నాడు. పచ్చని చెట్లమీంచి వీచే చల్లనిగాలి వారి శరీరాల్ని స్పర్శిస్తోంది.

* * * *

"నేను డిగ్రీ తీసుకొని ఆ ఊళ్ళో క్రొత్తగా ప్రాక్టీసు పెట్టాను. ఆ ఊర్లు మరీ అంత పెద్ద టౌను కాకపోయినా, ఊత్తిగా పల్లెటూరు మాత్రం కాదు. ఆ ఊళ్ళో ఒకే ఒక ఎమ్.బి.బి.ఎస్. డాక్టర్ ఉన్నాడు నాటువైద్యం చేసేవాళ్ళు ఆర్.ఎమ్.పి. డాక్టర్లు సరేసరి. నేను పేద కుటుంబంలోంచి వచ్చిన వాణ్ణి కావడంతో పట్టణంలో ప్రాక్టీసు పెట్టె స్తోమతు నాకు లేదు.

నేను ఆ వూరికి కొత్తవాణ్ణి కావడంతో పేషెంట్లెవరూ నా దగ్గరకు రావడం లేదు. కుర్ర డాక్టర్ కేంతెలుసులే అనేది వాళ్ళ ఉద్దేశం.

ఒకరోజు పనిలేక గోళ్ళు గిల్లుకొంటూ వీధిలోకి చూస్తున్నాను. ఇంతలో సుడిగాలిలా పరుగెత్తుకు వచ్చిందో యువతి.

'హమ్మయ్య....ఉన్నారు కదా' అంది గుండెమీద చేతులుంచుకొని. పరిశీలనగా చూశాను. ఆమె వయసు ఇరవై రెండు సంవత్సరాలకంటే ఎక్కువ ఉండవు. తెల్లిగా, అందంగా ఉంది. ముంగురులు నుదుటిమీద చెమటకు అతుక్కొని ఉన్నాయి.

'కూర్చోండి' అన్నాను ఎదురుగా ఉన్న కుర్చీ చూపుతూ.

'లేదు డాక్టర్ మీరు అర్జంటుగా రావాలి. మా అమ్మకు ప్రమాదంగా ఉంది. మాట్లాడటం లేదు. నాలుగిళ్ళ కవతలే మా ఇల్లు.' ప్రాధేయపడుతూ అంది.

నేను సంశయించడం చూసి 'ప్లీజ్....రారూ' అంది దీనంగా.

నేను ఇక ఉండలేక పోయాను. కాంపౌండరుకు చెప్పి ఆమె వెంట బయలు దేరాను. ఒక నలభై ఏళ్ళ స్త్రీ మంచంమీద పడుకొని మూలుగుతూ ఉంది. పేషెంటుకు ఇంజెక్షనిచ్చి, మందులు రాసిచ్చాను.

ఆ ఇంట్లో ఇక ఇద్దరు ఆడవాళ్ళున్నారు. మగవాళ్ళు ఎవరూ ఉన్నట్లు కనిపించలేదు.

'థాంక్స్ డాక్టర్. నామాటమీద గౌరవముంచి వచ్చారు. నాపేరు సుమలతండి తిరుపతిలో ఎమ్మెస్సీ ఫైనల్ చదువుతున్నాను. జ్వరంతో ఉన్నామె మా అమ్మ. ఈమె అమ్మమ్మ. ఆమె జేజమ్మ' అందర్నీ పరిచయం చేసింది.

'మీ నాన్నగారు ఏం చేస్తుంటారండీ'? అడిగాను కొంత చనువు తీసుకొని.

ఆమె ముఖంలో రంగులు మారాయి. కళ్ళలో నీరు గిర్రున తిరడం గమనించాను. 'అవన్నీ మీ డిస్పెన్సరీకొచ్చి చెబుతాను. డాక్టర్' అంది బాధగా.

వాళ్ళమ్మ విధవ అన్న సంగతి అప్పుడు గుర్తుకొచ్చింది. మనసులోనే నొచ్చుకొన్నాను అలా అడిగినందుకు.

పేషెంటుకు ఇకనేం భయంలేదని, రాసిచ్చిన మందులు జాగ్రత్తగా వాడమని చెప్పి వచ్చేశాను.

నేను అనుకొన్నట్లుగా ఆమె రాలేదు సరికదా. గంట తరవాత పక్కింటి అబ్బాయి వచ్చి నా ఫీజు డబ్బు ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆమె వస్తుందని, ఆ అందాల రాశితో కొద్దిసేపు మాట్లాడుదామనుకొన్న నా ఆశ నిరాశ అయింది.

దాదాపు మూడు నెలలు గడిచాయి. హఠాత్తుగా వూడిపడింది సుమలత.

'సారీ డాక్టర్ మిమ్మల్ని కలవలేక పోయాను. యూనివర్శిటీ ఎగ్జామ్సుకు వెళ్ళాను' అంది పశ్చాత్తాప పడుతున్నట్లు.

'నెవర్‌మైండ్. ఇప్పుడు గుర్తు పెట్టుకొని వచ్చారుగదా. దానికి సంతోషం.'

'ఛ.... గుర్తుపెట్టుకోక మరచిపోతానుట సార్. మీ సహాయాన్ని? ఆ డాక్టర్ గారు చూడబోతే ఇంటికి రారు. పేషెంటుని అక్కడికి తీసుకురమ్మంటారు. మీఅంత మంచివారు కాదు సార్. ఆయన.'

'ఇంతకీ మీ అమ్మగారు అలా అవడానికి కారణం.'

'అది డాక్టరుగా మీరు చెప్పాలిగదండీ.'

'చాలా రోజుల్నుంచి ఆమెగారేదో మానసిక వ్యథ అనభవిస్తున్నట్లుండి. డాక్టరుగా నేను చెప్పగలిగిందిదే.'

'కరెక్టుగా చెప్పారు. డాక్టర్. ఆమె దిగులంతా నా పెళ్ళి గురించే.'

'ఏం ఎక్కడా కుదర్లేదా?' చిలిపిగా అడిగాను.

ఆమె నా కళ్ళలోకి సూటిగా చూసింది. తరవాత సిగ్గుపడుతూ 'అదీ ఒక కారణ మనుకోండి. నన్ను చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు డాక్టర్' అంది.

'మిమ్మల్నిచూసి ఎవరూ రాకపోవడం ఏమిటండీ? పంచభక్ష్య పరమాన్నాలు ముందు పెట్టి తినమంటే వద్దనేవాడుంటాడా.'

'డాక్టర్‌గారూ! మీరు చాలా అమాయకులని, ఎంతమంది సుందరాంగులు వచ్చి మీ ముందు తమ సౌందర్యాన్ని ప్రదర్శించినా సిరంజి తీసుకొని ఇంజెక్షన్ చేస్తారేతప్ప, కన్నెత్తి చూడరని మా వీధిలో ఆడవాళ్ళంతా అనుకొంటుంటే విన్నాను. కాని ఇప్పుడు తెలుస్తోంది మీరెంత రసికులో'!

'అంతేగదండీ. రసికత అనేది అందరముందూ బయటపడదు. దానికి తగ్గ వాళ్ళు ఎదురైతేనే.'

'ఈజిట్!' పకపక నవ్వింది సుమలత.

ఆ నవ్వుకు పరవశించి పోయాను.

'డాక్టర్! మీరు మంచి యాక్టరండీ. మా ఆడ సమూహంలో మీరు అపర ప్రవరాఖ్యుడిగా గుర్తింపబడటం నా అదృష్టం. మిమ్మల్ని ఈ కొద్దికాలం పరిశీలించిన మీదట మీరు మచ్చలేని చంద్రుడిగా నా హృదయంలో స్థానమేర్పరచు కొన్నారు. మీకు నామీద స్థిరమైన అభిప్రాయం కలగటానికి ఆరు నెలలు టైమిస్తు న్నాను' అంది.

'ఆ తరువాత....'

'మీరు అవునంటే మీ ప్రక్కనే చోటు చేసుకొంటాను.'

అలా ప్రారంభమైన మా స్నేహం ఆరునెలలు తిరిగే సరికి గాఢ ప్రేమగా మారింది.

'ఏం సుమలతా, ఎప్పుడు మన పెళ్ళి? ముహూర్తాలు పెట్టించమంటావా?' చెరువు గట్టుమీద కూర్చొని నీళ్ళలోకి రాళ్ళు విసురుతూ అన్నాను.

సుమలత కొద్దిసేపు మౌనంగా ఉండి తల వంచుకొని అంది: 'మా అమ్మకు నా పెళ్ళి ఇష్టంలేదు.'

'ఏమిటి నువ్వనేది?'

'కంగారు పడకండి, పెళ్ళంటూ వద్దన్నదేగాని భార్యాభర్తలుగా సంసారం చేయవద్దనలేదు.'

'అంటే....?'

'మూడుతరాలుగా మా ఇంట్లో ముగ్గురు విధవల్ని. మా జేజమ్మ పెళ్ళయి. మా అమ్మమ్మ పుట్టగానే ఆమె భర్త చనిపోయాడట. ఆస్తంతా మా అమ్మమ్మకు వచ్చింది. మా అమ్మమ్మకు పెళ్ళిచేస్తే ఆమె భర్త మా అమ్మ పుట్టిన సంవత్సరానికి ఏక్సిడెంటులో పోయాడు. దాంతో మా అమ్మమ్మ అమ్మతో సహా భర్త ఆస్తి అమ్ముకొని వాళ్ళ అమ్మ ఇంటికి వచ్చేసింది. ఇక మా అమ్మకు పెళ్ళయి నేను పుట్టగానే మా నాన్న జాండీస్ వచ్చి చనిపోయాడు, దాంతో మా అమ్మ వాళ్ళ అమ్మ ఇంటికి వచ్చి చేరింది. ఇదీ చైన్. దీంతో మా అమ్మ భయపడిపోయి ఉంది. నా పెళ్లి విషయంలో....'

'నేనయినా విధవను కాకుండా భర్తతో సుఖంగా జీవించాలని అమ్మ కోరిక. పెళ్ళి కాకుంటే లోకులు కాకుల్లా పొడుస్తారని మా అమ్మ బాధ. పెళ్ళిచేస్తే నేను విధవనవుతానని ఆమె భయం. నాక్కూడా మన్మథుడిలాంటి మిమ్మల్ని చంపుకోవడం ఇష్టంలేదు.' మాట్లాడుతున్న సుమలత గొంతు రుద్ధమైంది. బుగ్గల మీదికి కన్నీరు కారుతూంటే ఓదార్పు మన్నట్లు నా ఒడిలో వాలిపోయింది.

నాకు జాలేసింది. కర్చీఫ్‌తో ఆమె కన్నీటిని తుడిచాను.

'ఇదేమైనా క్రానిక్ డిసీజ్ అనుకొన్నావా వంశ పారంపర్యంగా రావడానికి? నీదంతా వట్టి మూఢనమ్మకం' అన్నాను కొట్టిపారేస్తూ.

'మీరు ఏమనుకొన్నా సరే. పెళ్ళి విషయంలో నేను చెప్పినట్లు విని నన్ను మీ భార్యగా చేసుకుంటే చాలు' అంది సుమలత ఆశగా.

నేను చిరునవ్వు నవ్వాను. 'ఆల్‌రైట్. నీకోసం ఏ విధంగా నడుచుకోమన్నా నడుచుకొంటానని మాట ఇస్తున్నాను. ఇంత అందమైన అమ్మాయిని అంత తేలిగ్గా వదులుకొంటానా?' అన్నాను.

'థాంక్స్' అంది లేస్తూ.

ఇద్దరమూ బయలుదేరాము.

ఒకరోజు ఉదయాన్నే సుమలత డిస్పెన్సరీకొచ్చి ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు డిస్పెన్సరీ కట్టేసి ఇంటికి రమ్మని చెప్పిపోయింది.

ఆమె చెప్పినట్లే ఆ సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాను. సుమలత ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించింది. ఇంట్లో మిగతా ఆడవాళ్ల ముఖాలు కనిపించకుండా, తప్పించుకు తిరగసాగారు నన్ను బాత్‌రూమ్‌కు వెళ్ళి తలస్నానం చేసిరమ్మని టవలు అందించింది సుమలత.

'ఏమిటిది' అన్నాను ఆశ్చర్యపోతూ.

'ఈరోజు మన శోభనం' అంది సిగ్గుపడుతూ.

'ఏం బాగాలేదు ఈ పద్ధతి' అన్నాను.

ముఖం ఇంత చేసుకొని 'మీరేకదా నాతో సహకరిస్తానన్నారు. అందుకే ఇన్ని ఏర్పాట్లు చేశాను' అంది.

ఇక ఏం మాట్లాడలేదు నేను. స్నానంచేసి వచ్చేసరికి తెల్లని పంచె. షర్టు క్రొత్తవి అందించింది. అవి ధరించాను షడ్రషోపేతమైన భోజనం పెట్టింది. ఆ రాత్రి అందమైన శోభనపు గదిలో ఇద్దరమూ ఒకటయ్యాము.

ఇది జరిగిన తరవాత అక్కడ ఉంటే నలుగురూ నాలుగు మాటలు అని వాళ్ళని బాధలు పెడతారని అక్కడ నుంచి అందరమూ వచ్చేశాము. క్రమేణా నాకు గవర్నమెంటు ఉద్యోగం రావడం. ఇద్దరు కొడుకులు పుట్టడం మాకు ఆనందాన్నిచ్చింది. ఈరోజు వరకు సంతోషంగా జీవిస్తున్నాము. ఇదీ జరిగిన విషయం. ఆ రోజు నేను సుమలతకు తాళికట్టి శాస్త్రోక్తంగా పెళ్ళిచేసుకొని ఉంటే ఈనాడు మీ కళ్ళముందు కనిపించేవాణ్ణి కానేమో!" కథ ముగించాడు డాక్టర్ విజయమోహన్.

* * * *

"ఛ....ఛ....అన్నీ మూఢ నమ్మకాలు. ఒరేయ్! నువ్వు డాక్టరువయి ఉండి మా చెల్లాయి సుమలత పోస్టుగ్రాడ్యుయేటు అయిఉండి ఇలా చదువూ సంధ్యాలేని మూర్ఖుల్లా ప్రవర్తించారంటే మాకెంతో అవమానంగా ఉంది" అన్నాడు రామకృష్ణ.

"చదువుకొన్న వాళ్ళలోనే ఈ మూఢ నమ్మకాలు ఎక్కువ." వత్తాసు పలికాడు కాంతారావు.

"ఇట్లాంటి మూఢ నమ్మకాల్ని మనం ఛేదించాల్సింది పోయి ప్రోత్స హించడమా. డామ్ ఇన్సల్ట్!" ఆనంద్ అందుకొన్నాడు.

"ఒరేయ్ అమాయకుల్లారా. మీకు డామ్ ఇన్సల్టింగ్ అనిపించేవి ఇంకా ఈ సమాజంలో చాలా ఉన్నాయని గుర్తుంచుకోండి. అది సాంప్రదాయం....ఆచారం. ఎన్ని చెప్పినా దాన్ని విడనాడలేము." వాదించాడు విజయమోహన్.

"అయితే, మీ శ్రీపతి కుటుంబంలో ఆలా ఎందుకు జరిగిందంటావ్?"

"ఒరేయ్! జరిగిందేదో జరిగిపోయింది. విషయం చెప్పాడు. ఇక ఎందుకు దానిమీద చర్చలు?"

"నో....నో....అలాకాదు. మనం విజయమోహన్‌కి, చెల్లాయికి ఇప్పుడు పెళ్ళి చేసి, ఆవిడగారి వంశంలో జరిగిన దుర్మరణాలు ఇప్పుడు జరగవని రుజువు చెయ్యాలి."

"ఎలా?" అందరూ తమలో తాము ప్రశ్నించుకొన్నారు.

"ఎలా ఏమిటి? ఆవిడగారిని అందరం కలసి ఒప్పించి. ఒక శుభముహూర్తాన విజయమోహన్‌చేత తాళి కట్టించాలి."

విజయమోహన్ గుండె దడదడ లాడింది.

"ఛ....ఛ....వాడి పెద్దకొడుకు వైజాగ్‌లో డాక్టరు. రెండవ కొడుకు బాంకులో ప్రొబేషనరీ ఆఫీసరు. ఇప్పుడు పెళ్ళా ? నోరు ముయ్యండిరా."

ఒక క్షణమాగి రాజారావుకు జవాబు చెప్పాడు ఆనంద్: "పెళ్ళంటే పది మంది బంధువుల్ని పిలిచి బాజా భజంత్రీలతో జరిపే పెళ్ళికాదు. మనమే పెళ్ళి పెద్దలం. పెళ్ళి వాడింట్లోనే.... మేళతాళాలు లేకుండా ఒక పురోహితుణ్ణి పెట్టి వేద మంత్రాలు చదివి సుమలత మెడలో తాళి కట్టించడం. మనం అక్షింతలు చల్లడం అంతవరకే."

"నో. నే నొప్పుకోను. మా కిప్పుడు పెళ్ళేమిటి?" అడ్డం తిరిగాడు విజయ మోహన్.

అందరూ ఎంతో నచ్చజెప్పారు. మూఢ విశ్వాసాలను ఖండించాల్సింది విద్యా వంతులేనని, మిగతా దేశాలకంటే భారతదేశం కొన్ని విషయాల్లో వెనుకబడి ఉండ టానికి కారణం మూఢ విశ్వాసాల్ని అనుసరించడమేనని. కనుక ఈ విషయంలో

అడ్డు చెప్పవద్దని ఎంతో దూరం చెప్పారు. ఆఖరుకు అందరి బలవంతంమీద ఒప్పు కొన్నాడు. ఆ రాత్రి విజయమోహన్ ఇంటికి చేరేసరికి రాత్రి పదకొండు గంట లయింది.

*   *   *   *

విజయమోహన్ చెప్పిన మాటకు పక్కనే పడుకొనిఉన్న సుమలత ఉలిక్కి పడింది. తాను పాముపడగ నీడన ఉన్నట్లు భయపడింది.

"ఏమిటి మీరనేది?" భర్తను కుదుపుతూ అంది.

"ఇందులో తప్పేముంది. సుమలతా? తాళి కట్టనిది లేపుకొచ్చిన దానితో సమానం. ఇప్పటికైనా నీకు అసలైన గౌరవం కలిగించడం కోసం నీ మెడలో బ్రాహ్మణ మంత్రాల మధ్య తాళి కడతాను."

"ఏమండీ! మనం దంపతుల మయిందీ, లేందీ మీ కీ ఇరవై అయిదేళ్ళ సంసార జీవనంలో తెలియలేదా? నా గౌరవాని కిప్పుడేం తక్కువైందని?"

ఆమెకు వైజాగ్‌లో డాక్టరుగా పనిచేస్తున్న అమర్. బాంకులో ఆఫీసరుగా పనిచేస్తూ నెల్లూరులో ఉంటున్న చిన్నకొడుకు కృష్ణ గుర్తుకొచ్చారు. పెద్దకొడుకుకి సంవత్సరం క్రితమే వివాహమయింది కూడా. సంతృప్తిగా ఉన్న తమ సంసారంలో కలతలు రావడం తథ్యమనిపిస్తోంది సుమలతకు.

"సుమలతా! మనం భార్యాభర్తలుగా ఈ పాతికేళ్ళ నుంచి జీవిస్తున్నా. మెడలో తాళి లేని నిన్ను చూస్తుంటే నాకేదో లోటు కొట్ట వచ్చినట్లు కనిపిస్తోంది."

"ఏమండీ! ఏవైనా అపవాదులొస్తే భరించాల్సింది నేను. వచ్చిన అప వాదుల్ని తేలిగ్గా ఎదిరించాను ఇంకా ఎదిరించగలను కూడా."

"అలా కాదులే. సుమలతా. భార్య మెడలో తాళి లేకపోతే భర్త మరణించి నట్లే లెక్క. ఎంతయినా ఆడదానికి తాళి ముఖ్యంగదా."

"ప్లీజ్. ఇక ఆ విషయాన్ని తరచి తరచి మాట్లాడకండి. నాకు పసుపు కుంకుమలు ఉండేట్లు చేయండి. భగవంతుడా! నా బిడ్డలకు తండ్రిలేని లోటు రానీయకు." బిగ్గరగా ఏడ్చింది.

"పిచ్చిదానా! అలా ఎన్నటికీ జరగదు." భార్యను ఓదారుస్తూ అన్నాడు.

"మీరెన్ని చెప్పినా నేను దీనికి ఒప్పుకోను."

"అయితే, నామీద నీకున్న ప్రేమ ఇదేనా? ఈ చిన్న కోరికకు నీ నిర్ణయాన్ని త్యాగం చేయలేవా. సుమలతా" అన్నాడు ప్రతిమాలాడుతూ.

"నో. అలా ఎన్నటికీ జరగదు," ఖండితంగా చెప్పింది.

విజయమోహన్ సీరియస్‌గా అటు తిరిగి పడుకున్నాడు.

సుమలత మనసంతా గందరగోళంగా ఉంది. అక్కణ్ణుంచి లేచి పెళ్ళి పక్క గదిలో పడుకొని కరువుతీరా ఏడ్చింది. తను విజయమోహన్‌తో సంసారానికి వచ్చిన తరవాత మొదటి కాన్పులో కొడుకు పుట్టినప్పుడు తన తల్లి ఎంత ఆనందించింది! తరవాత బిడ్డ మగపిల్లవాడే.

తమ వంశంలో అందరూ ఆడపిల్లలే పుట్టడం పెళ్ళయిన తరవాత వైధవ్యం రావడం గత నాలుగు తరాలుగా జరుగుతోంది. ఇప్పుడు చరిత్ర తారుమారైంది. తన కూతురితో కొత్త జీవితం ప్రారంభమైందని ఎంతో పొంగిపోయింది తల్లి. ఇప్పుడు తన తల్లి చిన్న కొడుకు కృష్ణ దగ్గరే ఉంది. పాలపొంగులాంటి తన సంసారంలో విషపు బొట్లు చిందుతాయేమోనని భయపడసాగింది సుమలత.

భర్తతో తను ఎప్పుడైనా గొడవపడిందా? అతని మాట తనెప్పుడైనా కాదందా? ఆలాంటి భర్త తనతో సీరియస్‌గా ఉంటే ఒక్కరోజు బ్రతగ్గలదా? రాత్రంతా ఆలోచించి చివరకు భర్త చెప్పినట్లు వినడానికే నిర్ణయించుకొంది. అంతా దేవుడిమీద భారం వేసింది.

ఉదయం లేచినప్పటి నుండి ఆమె భర్తను తప్పించుకుని తిరగసాగింది. సరిగ్గా ఎనిమిది గంటలకు విజయమోహన్ మిత్ర సమూహం వచ్చేశారు. మౌనంగా అందరికి టిఫిన్లు పెట్టి కాఫీ అందించింది. అప్పుడు పరిశీలనగా చూశాడు విజయమోహన్. ఆమె కళ్ళు ఎఱ్ఱగా ఉబ్బి ఉన్నాయి. ముఖంలో సంతోషం మాయమయింది. తను సుమలత మనసును కష్టపెడుతున్నాడేమోనని ఒక క్షణం బాధపడ్డా, మరలా మిత్రుల హిత వచనాలు గుర్తుకు వచ్చి ధైర్యం తెచ్చుకొన్నాడు.

"చెల్లాయ్.....విజయమోహన్ నీకు అన్ని విషయాలు చెప్పాడుగదా. ఎందుకు అంత భయపడతావ్? ఇంత పెద్ద డాక్టరుండి. ఇంకో డాక్టరుకు ప్రమాదం రానిస్తాడా? మమ్మల్ని చూసి మృత్యువు ధైర్యంగా ముందుకు వస్తుందా?" గర్వంగా చెప్పాడు డాక్టర్ ఆనంద్

"సుమలతా, భయపడకమ్మా ఎన్ని బంగారు గొలుసులు వేసుకొన్నా తాళి ఉంటేనేగదమ్మా గృహిణికి సంపూర్ణ అలంకారం నా మాట నమ్ము. అతనికేమీ జరుగదు." రామకృష్ణ హామీ ఇచ్చాడు.

"నువ్వు నా చెల్లెలు లాంటి దానివి. నా చెల్లెలు మెడలో తాళి లేకుంటే నే నూరుకుంటానా? నా చెల్లెలుగా నిర్భంధిస్తున్నాను. నువ్వు విజయమోహన్ చేత తాళి కట్టించుకోవాలమ్మా. లేకపోతే ఊరుకొనేది లేదు. నీ మూఢ నమ్మకాలు ఇక నైనా వదులుకో." సుతిమెత్తగా మందలించాడు కాంతారావు.

ప్రశాంతంగా జవాబిచ్చింది సుమలత.

"అన్నయ్యా తాళికడితే భర్తకు ప్రమాదం జరుగుతుందేమోనని నే నను కోవడం మూఢ నమ్మకమే.... కాదనను. మెడలో తాళి కడితేనే పెళ్ళనడం మూఢ నమ్మకం కాదా...."

"అది సంప్రదాయం.... ఆచారం తల్లీ."

"ఏది సంప్రదాయం? మెడలో పసుపుతాడు ఉరితాడుగా మారడమేనా మన సంప్రదాయం? ఆ సంప్రదాయం ఎవరికి కావాలి?"

"అమ్మా, నువ్వు తెలివిగలదానివి. నీతో వాదించలేము. ఇంతకీ విజయ మోహన్ ప్రపోజల్స్‌కు నువ్వు అంగీకరించినట్లేనా?"

తలెత్తి భర్త కళ్ళలోకి ఒకసారి చూసి తను ఒప్పుకొన్నట్లు తల ఊపింది. ఇక అక్కడ ఉండలేక భారమైన మనసుతో లోపలికి వెళ్ళిపోయింది.

మిత్రులందరూ బయలుదేరి ఒక బ్రాహ్మణుని కలుసుకొని ముహూర్తం పెట్టించారు. పురోహితునిగా కూడా అతణ్ణే ఎన్నుకొన్నారు.

ఈ విషయం పిల్లలకు, తన తల్లికి తెలియజేద్దామంటే సిగ్గుగాను, భర్త ఎవరికీ చెప్పవద్దని ఆంక్షలు పెట్టిన తరవాత భయంగాను ఉంది.

రోజులు గడచిపోతున్నాయి. ముహూర్తం దగ్గరకు వచ్చింది ఆ రోజు రామకృష్ణ, కాంతారావు. ఆనంద్ తమ తమ భార్యలతో సహా వచ్చారు. పని మనుషులందరినీ తలా ఒక పనిమీద ఇంట్లో లేకుండా చేశారు. డాక్టర్ విజయ మోహన్ లంకంత భవనంలో, మధ్య హాల్లో ఇద్దర్నీ పీటలమీద కూర్చోబెట్టి పెళ్ళి తతంగం జరిపించాడు పురోహితుడు. శాస్త్రోక్తంగా తాళి కట్టాడు విజయమోహన్.

భోజనాలయిన తరవాత ఆడవాళ్ళంతా సుమలతను శోభనపు గదిలోకి పంపిస్తే, మగ వాళ్ళంతా 'బెస్ట్ ఆఫ్ లక్' అంటూ విజయమోహన్‌ని విష్ చేసి ఎవరి ఇండ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు.

కాలం గడిచిపోతూ ఉంది. విజయమోహన్ సంతోషంగా ఉన్నాడు. విషయం తెలిసిన ఇద్దరు కొడుకులు, కోడలు సంతోషించారు. ఇపుడు బాధపడేది సుమలత. ఆమె విధవ తల్లి. ఎవరి ఓదార్పు మాటలూ వాళ్ళని శాంతింప జేయలేకపోతున్నాయి. ఏ రోజు కారోజు భయం భయంగా గడుపుతున్నారు.

*   *   *   *

రోజులు గడచిపోతున్నాయి. భర్త తనను వదలి ఎక్కడికి పోతాడో అన్నట్లు అతణ్ణి వెన్నంటే తిరుగుతోంది సుమలత. రాత్రుళ్ళు అతని గుండెలో ఒదిగి పడుకొంటోంది. ఆరునెలలు గడచిపోయాయి. ఆరోజు క్లబ్బు తరపున టెన్నిస్ మాచ్‌లు జరుగుతున్నాయి. అంతా నేషనల్ ప్లేయర్స్. చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుందని అందరూ ఆతృతగా వస్తున్నారు. మొదటి వరుసలోని నాలుగు కుర్చీలలో డాక్టర్ ఆనంద్, కాంతారావు, రామకృష్ణ కూర్చుని ఉన్నారు. అతని ప్రక్కనే ఇంకో ఖాళీ కుర్చీ ఉంది. అది డాక్టర్ విజయమోహన్ కోసం నిర్దేశింపబడింది. అతను ఇంకా రాలేదు. ప్లే స్టార్టయింది.

ఇంతలో పరుగెత్తుకు వచ్చి రామకృష్ణ చెవిలో ఒక న్యూస్ ఊదాడు క్లబ్బు ప్యూన్ నరసింహులు. రామకృష్ణ కాంతారావు చెవిలోను, కాంతారావు ఆనంద్ చెవిలోను క్షణాలమీద వార్త చేరవేశారు. అందరూ నిరుత్తరులై పోయారు. ఇంకేముంది? అందరూ ఆఘమేఘాలమీద గవర్నమెంటు హాస్పిటల్‌కు వచ్చి పడ్డారు. విజయమోహన్ శరీరం మీద అంగుళం తేడా లేకుండా బాండేజి కట్టబడి ఉంది. ముఖం మాత్రమే కనిపిస్తూ ఉంది. ముక్కులోంచి కారే రక్తాన్ని గుడ్డతో తుడిచి వేస్తూ ఉంది నర్సు. అతణ్ణి ఎమర్జెన్సీ వార్డులో చేర్చి ఉన్నారు.

"అసలు ఏక్సిడెంటు ఎలా జరిగింది. డాక్టర్?"

"పోలీసు రిపోర్టు ఇలా ఉంది. ఈయనగారు స్కూటరుమీద లెఫ్ట్ సైడే వస్తున్నారు. కాని ఎదురుగా వస్తున్న లారీ డ్రైవరు తాగి ఉన్నాడు. వాడు నేరుగా వచ్చి ఈయన్ని గుద్దేశాడు. ఈయన తప్పించుకుపోలేక పోయాడు. సరాసరి లారీ చక్రాల క్రింద పడ్డాడు. బ్రతకడం ఇంపాసిబుల్."

ఇక వినలేక పోయారు.

ఒకవైపు సుమలత ప్రాణంలేని దానిలా కింద కూర్చొని భర్త కాళ్ల దగ్గర తల పెట్టుకొని శోకదేవతలా ఉంది. ముఖాన పట్టిన చెమటతో ఆమె కుంకుమ కరిగి కిందికి కారుతూ ఉంది. విజయమోహన్ స్నేహితుల భార్యలకు విషయం తెలిసి వచ్చి సుమలతను ఓదారుస్తున్నారు.

అందరికీ ట్రంక్ కాల్స్ వెళ్ళాయి. టెన్నిస్ గేమ్స్ ఆ రోజుకు కాన్సిల్ చేశారు. క్లబ్బు మెంబర్లు అంతా వచ్చి చూసి వెళ్ళారు. రాత్రి పది గంటలకు పెద్ద కొడుకు భార్యతో సహా వస్తే, చిన్నకొడుకు అమ్మమ్మను తీసుకొని రాత్రి పన్నెండు గంటలకు వచ్చాడు.

స్పృహ తప్పిన తల్లిని ప్రక్క బెడ్‌మీద పడుకోబెట్టి శుశ్రూషలు చేస్తూ తండ్రి కెప్పుడు తెలివి వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

వేకువ జామున నాలుగు గంటలకు స్పృహ వచ్చింది విజయమోహన్‌కు. అందరూ ఎంతో ఆనందించారు.

"అమ్మా....అమ్మా....నాన్నకు....స్పృహ వచ్చింది. లేమ్మా" అంటూ తల్లిని కుదుపుతూ లేపారు కొడుకులు.

భర్తకు స్పృహ వచ్చిందనగానే సుమలతలో జ్ఞాననాడులు మేల్కొన్నాయి. కళ్ళు తెరిచింది. ఎంతో హుషారుగా లేచి కూర్చొంది. తల్లికి సాయంగా ఇద్దరు కొడుకులూ ఆమెను పట్టుకొని తండ్రి బెడ్ దగ్గరకు తీసుకు వచ్చారు.

"ఏమండీ" అంది భర్త తల దగ్గర కూర్చుని.

అందరూ గుమిగూడారు.

"సుమలతా! నీ మనసును దుఃఖపెట్టి పోతున్నానుగదూ? ప్రేమ త్యాగాన్ని కోరుతుంది సుమలతా. నా మీద ప్రేమతో నీ పసుపు కుంకుమల్ని త్యాగం చేశావు." అతి కష్టంమీద చేయెత్తి ఆమె తల స్పర్శిస్తూ అన్నాడు.

సుమలత ఏమీ చేయలేని దానిలా దీనంగా చూసింది.

"నేను ఇక కొన్ని నిముషాల కంటే ఎక్కువ బ్రతకను. ఒరేయ్, అమర్, ఒరేయ్! కృష్ణా" అంటూ దగ్గరకు పిలిచాడు.

"బాబూ! నా దేవతను మీ చేతుల్లో పెడుతున్నాను మీ అమ్మను ఎలా చూసుకొంటారో" అంటూ భార్య చేతిని ఇద్దరు కొడుకుల చేతుల్లో ఉంచాడు.

అంత పెద్ద పిల్లలూ తండ్రి శరీరాన్ని నిమురుతూ బావురుమని ఏడ్చారు. ఇక సుమలత దుఃఖం చెప్పనవసరం లేదు.

మిత్రులు ముగ్గురూ మెల్లిగా విజయమోహన్‌ని సమీపించారు.

సుమలతవైపు కన్నెత్తి చూడ్డానికి భయపడుతున్నారు.

ఒకరు 'మృత్యువు తనను చూసి పారిపోతుంద'ని భరోసా ఇచ్చారు. ఇంకొకరు 'నా చెల్లెలి లాంటి దానివి. నీ మెడలో తాళి లేకపోతే నే నూరుకోను' అంటూ నిర్బంధించారు. 'తాళి ఉంటేనేగదా సంపూర్ణ గృహిణి. నీ భర్తకేం జరగదు' మరొకరు హామీ ఇచ్చారు.

ఇప్పుడు ఆ హామీలన్నీ గాలిలో కలసిపోయాయి.

సుమలతది మూఢ విశ్వాసమే కావచ్చు. జరిగింది ఏక్సిడెంటే కావచ్చు. కాని నమ్మకాలు జ్ఞానేంద్రియాల్లా పనిచేస్తాయి.

ప్రయోగం వేరు. జీవితం వేరు.

"విజయమోహన్! మమ్మల్ని క్షమించరా" అన్నారు ముగ్గురూ ఏకకంఠంతో.

సుమలత తన దృక్కుల్ని వాళ్ళవైపు సారించింది.

ఆమె కళ్ళ నిండుగా నీళ్ళు.

"ఇందులో మీ తప్పేమీ లేదురా. మీ చెల్లెలికి తోడుగా ఉండండి." గొణిగాడు.

గొణుగుతూనే కళ్ళు మూశాడు.

సుమలత చుట్టూ చీకటి ఆవరించింది.